క్లుప్తంగా

మార్కెట్‌లోకి మధుర ఫలం



మార్కెట్టులో విక్రయానికి సిద్ధంగా ఉన్న బంగినపల్లి మామిడి పండ్లు

చిల్లకూరు : వేసవి కాలం వచ్చిందంటే మామాడి పండ్ల సీజన్‌ ప్రారంభమైనట్టే. ఈ ఏడాది కొంత ఆలస్యంగా పూత వచ్చింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కాయలను కోసి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. అక్కడక్కడా మధుర ఫలం కనిపిస్తోంది. మామిడిలో రారాజుగా పిలిచే బంగినపల్లి మామిడి పండ్లు అందుబాటులోకి వచ్చాయి. కేజీ రూ.90 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. దీంతో సామాన్యుడు కొనుగోలు చేయలేకపోతున్నాడు. ఏది ఏమైనప్పటికీ ఈ నెలఖారుకు అన్ని ప్రాంతాల్లోనూ కాయలు కోతకు వచ్చి పండ్ల ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న వేద పండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సునీల్ నగర్‌లో దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో ఆదివారం కార్యసిద్ధి ఆంజయనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇందులో భాగంగా వాస్తు పూజ, క్షీరాధివాసం, విగ్రహ ప్రతిష్ట, విశేష అభిషేకాలు, హోమం, పూర్ణాహుతి చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భాస్కరరెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న లోకేష్‌, శేషసాయి

రాపూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఆదివారం బెంగళూరుకు చెందిన శ్రీస్కంధ ఆయుర్వేదిక్‌ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు శేషసాయి, కడివేటి లోకేష్‌ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు పైల్స్‌, హెర్నియా, కీళ్ల నొప్పులు, షుగర్‌, బీపీ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు క్రితిక, భువనేశ్వరి, కిషోర్‌, సాయిదీపిక, సంధ్యన, మితాస్‌, కందుకూరు మస్తాన్‌బాబు, కందుకూరు చంద్రశేఖర్‌, కోలా వెంకటేశ్వరావు, పద్మావతి, కడివేటి నారాయణరావు, ప్రసాద్‌, రమేష్‌, చెంచురామయ్య పాల్గొన్నారు.

దూడ మృతి



మృతి చెందిన దూడను చూస్తున్న ఆవు

చిల్లకూరు : మండలంలోని వడ్డికండ్రిగ గ్రామంలో ఓ పాడి రైతుకు చెందిన ఆవు దూడను ఆరుబయట కట్టి ఉంచగా పక్కనే ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఈ దాటికి ఆవు బయటకు పరుగు తీయగా దూడ మృతి చెందింది.

గూడూరు మండలంలో గేదె..

గూడూరు రూరల్ : గూడూరు మండలం చెన్నూరు పంచాయతీలో పిడుగు పడి శ్రీనివాసులకు చెందిన పాడి గేదె మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంటుందని పాడి రైతు తెలిపారు.

లోపించిన నాణ్యత



మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకోసం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కింద నీటి తొట్టెల నిర్మాణం చేపట్టింది. పనులు చేపట్టిన తెలుగు తమ్ముళ్లు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. బాలాయపల్లి మండలం పిగిలాం పంచాయతీ జార్లపాడులో నిర్మించిన నీటి తొట్టెకు నీరు పట్టిన వెంటనే చీలి పోయింది. పనులను నాసిరకంగా చేయడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని కోరుతున్నారు.
– బాలాయపల్లి(సైదాపురం)

చేప చేపా నోటికి చిక్కవే

దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువుల్లోకి సంతానోత్పత్తి కోసం వచ్చిన విదేశీ విహంగాలు స్వదేశానికి బయలుదేరాయి. నేలపట్టు చెరువులోకి వచ్చిన కొన్ని వయస్సు పైబడిన, ఎక్కువ దూరం ఎగరలేని పక్షులు ఇక్కడే ఉండిపోతాయి. అవి మేత కోసం పక్కనే ఉన్న చిట్టమూరు మండలంలోని పలు చెరువుల్లోకి వచ్చి చేపలను ఆహారంగా తీసుకుని మరలా సాయంత్రానికి నేలపట్టు పక్షుల కేంద్రానికి వెళ్లి పోతుంటాయి. ఈ క్రమంలో నాయుడుపేట–మల్లాం రోడ్డు పక్కనున్న జోడు చెరువులో చేపల కోసం వెతుకుతూ కనిపించాయి. – చిట్టమూరు



పశువుల మేతగా పుచ్చ పంట



చిట్టమూరు మండలంలోని రామాపురం, చిల్లమూరు, మొలకలపూడి గ్రామాల్లోని రైతులు పుచ్చ పంటను సాగు చేశారు. కాయలకు ధరలు లేకపోవడం, కొనుగోలు చేసేవారు లేకపోవడంతో పంటను పశువుల మేతగా వదిలేశారు. గత సంవత్సరం పుచ్చకాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది నాలుగు గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో పుచ్చ సాగు చేశారు. కాయలు కూడా పెద్దగా సైజులు రాకపోవడం, ధరలు తగ్గిపోవడంతో కోత కోస్తే కూలీలకు కూడా సరిపడా ఖర్చులు రావని భావించి రైతులు కాయలను పొలంలోనే వదిలేశారు. – చిట్టమూరు

ఘనంగా పోలేరమ్మ జాతర ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో ఘటోత్సవం
- ఘటానికి ఇంటింటా పూజలు
- జాతర నిర్వాహకులపై పెదకాపు ఆగ్రహం
- సంప్రదాయబద్ధంగా జాతర నిర్వహించాలని సూచన



పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న పెదకాపు, దేవదాయ శాఖ అధికారులు

నాయుడుపేట టౌన్‌ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఘటోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శెట్టిపల్లివారి వీధిలో ఉన్న పోలేరమ్మ అలంకార గుడి వద్ద గ్రామపెద్దలతో పాటు విన్నమాల పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, స్థానిక దేవదాయశాఖ ఈవో ముసుమూరి రవికృష్ణ, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పోలేరమ్మ ఘటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికీ ఘటాన్ని తీసుకెళ్లి మడి బియ్యం, నగదు, కానుకలు సేకరించారు. అంతకుముందు పెదకాపు, గ్రామ పెద్దలు, జాతర నిర్వాహకులు కుమ్మరిమిట్టలో మట్టితో చేసిన పోలేరమ్మ రెండు ప్రతిమలను పరిశీలించారు. వాటిలో ఒక దాన్ని పూజలకు తయారుచేయాలని కుమ్మరి అద్దంకి రవికి సూచించారు. కార్యక్రమంలో దేవదాయశాఖకు చెందిన యుగంధర్‌, జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, ఆకులు కుబేరు మణి, యాదపతి జనార్దన్‌ యాదవ్‌, వినుకొండ ధనుంజయ, బీఎల్‌ శ్రీనివాసరావు, నల్లబోతుల రామారావు, కూటమి నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలేరమ్మ ఆలయం వద్ద అనేక మంది ఆదివారం నుంచే భక్తులకు అంబలి పంచిపెట్టారు.



ఘటానికి పూజలు చేస్తున్న పెదకాపు శ్రీనివాసులు రెడ్డి, అధికారులు, నిర్వహకులు



ఇళ్ల వద్దకు వెళ్లి మడి బియ్యం తదితర కానుకలను స్వీకరిస్తున్న నిర్వాహకులు

జాతర నిర్వహకుల తీరుపై పెదకాపు ఆగ్రహం

జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆలయ పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి అధికారులు, జాతర కమిటీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఘటోత్సవాన్ని నిర్వహించాల్సి ఉండగా ఎవరు రాకపోవడం, ఘటంతో పూజలు నిర్వహించే అమ్మవారి మెట్టినిల్లుగా పిలుబడే శెట్టిపల్లివారి వీధిలో కనీసం పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జాతర మొదటి చాటింపు రోజున కూడా నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. కుమ్మరిమిట్టలో పోలేరమ్మ మట్టి విగ్రహాన్ని తయారు చేసిన తర్వాత ఎవరూ చూడకూడదని తెలిపారు. నిర్వాహక కమిటీ సభ్యులు ప్రతిమను చూడడం, అమ్మవారి విగ్రహం పూర్తికాక ముందే ఫొటోలను వాట్సాప్‌లో పెట్టడంపై మండిపడ్డారు. జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని హితవుపలికారు.

బదిలీల్లో అవకతవకలు జరిగాయన్నది అసత్యం



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

నాయుడుపేట టౌన్‌ : నాయుడుపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని యూటీఎఫ్‌ నాయకులు స్పష్టం చేశారు. దీనిపై విచారణ జరిపి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. వారు ఆదివారం ఎంఈవో మునిరత్నంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2025 మేలో బదిలీల నేపథ్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్కూల్‌ ప్లస్‌ విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని ప్రభు త్వం ఆదేశించినట్లు తెలిపారు. ఈ క్రమంలో పీజీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ఒక ఉపాధ్యాయ సంఘం వారు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. దీనిపై స్పందించిన ఎంఈవో విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పటిష్ట బందోబస్తు నడుమ నీట్‌ పరీక్ష



పరీక్ష కేంద్రంలోని రిజిస్ట్రేషన్‌ వద్ద పరిశీలిస్తున్న తహసిల్దార్‌ చంద్ర శేఖర్‌

చిల్లకూరు : గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో ఆదివారం నీట్‌ పరీక్షను పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించారు. 450 మంది వరకు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష అయినప్పటికీ విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదేశాల మేరకు ప్రత్యేక బలగాలు మెటల్‌ డిటెక్టర్‌తో విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుమతించారు. గూడూరు తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ విద్యార్థుల రోల్‌ నంబర్లను పరిశీలించారు. బయట బందోబస్తును ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు పర్యవేక్షించారు.

మాజీ బిషప్‌ మైఖేల్‌ బెన్‌హర్‌కు ఘన సన్మానం



మైఖేల్‌ బెన్‌హర్‌, ఇందిర దంపతులను సన్మానిస్తున్న సంఘ పెద్దలు తదితరులు

నాయుడుపేట టౌన్‌ : మాజీ బిషప్‌ డాక్టర్‌ ఓ మైఖేల్‌ బెన్‌హర్‌ చేసిన సేవలను గుర్తించి గత నెల 25న హైదరాబాద్‌కు చెందిన ఆంధ్రా క్రిస్టియన్‌ థియోలాజికల్‌ కాలేజీ గౌరవ డాక్టరేట్‌ అందజేసింది. ఈ క్రమంలో ఆయనతోపాటు ఆయన సతీమణి ఇందిరను ఆదివారం నాయుడుపేటలోని బేరిపేటలో ఎస్‌ఏఎల్‌సీ చర్చి వద్ద ఘనంగా సన్మానించారు. అంతకుముందు చర్చి వద్ద సండ్‌ స్కూల్‌లో వీబీఎస్‌ (విరామ కాల బైబిల్‌ పాఠశాల) శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ బోర్డు చైర్మన్‌ కేజే జ్ఞానానందం, చర్చి పీసీసీ చైర్మన్‌ కారల్‌ మధు, వైస్‌ చైర్మన్‌ కాళహస్తి బాబురావు, సండే స్కూల్‌ కరస్పాండెంట్‌ ప్రేమ్‌ చంద్‌, మాజీ పీసీసీ చైర్మన్‌ కేఎం ఆనంద రావు, కళాచంద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖనిజాన్ని తరలిస్తున్న లారీ సీజ్‌

- ఆరుగురిపై కేసు నమోదు



లారీకి ఖనిజాన్ని లోడ్‌ చేస్తున్న యంత్రం

సైదాపురం: స్పోక్‌ క్వార్ట్జ్‌ ఖనిజాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సైదాపురం తహసీల్దార్‌ కార్యాలయం సమీపంలో వున్న యార్డు నుంచి ఆదివారం తెల్లవారుజామున క్వార్ట్జ్‌ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ క్రాంతికుమార్‌ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఖనిజాన్ని లోడింగ్‌ చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో హాజరత్తయ్య ఫిర్యాదు మేరకు పనులు చేయిస్తున్న ఆరుగురిపై క్రిమినల్‌ కేసులను నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

తడ: బైక్‌ బోల్తాపడి గాయపడిన తమిళనాడు తిరువళ్లూరు జిల్లా ఆరంబాకం పంచాయతీ బాటకుప్పానికి చెందిన దేశప్పన్‌(14) ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం మేరకు.. బాలుడు దేశప్పన్‌ ఏప్రిల్‌ 29న తిరునాళ్లను చూసేందుకు వాటంబేడు వచ్చాడు. అక్కడ బంధువు ల బైక్‌ తీసుకుని స్నేహితుడు శివలింగంతో కలిసి సూళ్లూరుపేట బయలుదేరాడు. రోడ్డు మలుపులో బైక్‌ అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని పోలీసులు సూళ్లూరుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేశప్పన్‌ మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శివలింగం స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భక్తులకు అన్నదానం

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురంలో వున్న టీటీడీ అనుబంధ శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ వేద నారాయణ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడులోని అంజికరైకి చెందిన ధనశేఖర్‌, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించినట్టు ఆలయ అధికారి చెంగల్‌ రాయులు తెలిపారు. వారికి స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్యులు, ధర్మరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

కమిషనర్‌ చిన్నయ్యపై చర్యలు?

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు నగర పాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం సూళ్లూరుపేట మున్సిపల్‌ కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్‌ పరిపాలన శాఖ (డీఎంఏ) వారం క్రితం ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో చేరడం, ఉద్యోగోన్నతులు పొందడంలో అక్రమాలకు పాల్పడినట్లు అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అనంతపురం మున్సిపల్‌ ఆర్‌డీ విశ్వనాథ్‌ నివేదిక మేరకు చిన్నయ్యను వెంటనే సూళ్లూరుపేట కమిషనర్‌గా రిలీవ్‌ చేస్తూ.. చిత్తూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించి, విధుల్లో చేరిన తర్వాత సస్పెండ్‌ చేసి, క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని పేర్కొంది. అలాగే చిన్నయ్యకు అపాయింట్‌మెంట్‌ ఆర్డర్‌, ప్రమోషన్లు ఇచ్చిన అధికారులపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే దీనిపై చిన్నయ్య హైకోర్టును ఆశ్రయించడంతో జీఓపై కోర్టు స్టే విధించింది. అయితే చిన్నయ్యపై క్రమశిక్షణ చర్యలు చేపట్టే దిశగా అధికారులు న్యాయ సలహాలు తీసుకుంటున్నారు.

కండలేరులో 45.094 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 45.094 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 60, పిన్నేరు కాలువకు 150, లోలెవల్‌ కాలువకు 50, హైలెవల్‌ కాలువకు 30, మొదటి బ్రాంచ్‌ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అలరించిన కురుక్షేత్ర యుద్ధం



వాటంబేడులో ఏర్పాటుచేసిన అగ్నిగుండం

తడ: మండలంలోని వాటంబేడులో ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయ తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కురుక్షేత్ర యుద్ధం, తెప్పోత్సవం కార్యక్రమాలు చేపట్టారు. భారతంతలో కురుక్షేత్ర యుద్ధం, దుర్యోధన వధ, అగ్నిగుండం కార్యక్రమాలు అలరించాయి. రాత్రి తెప్పోత్సవం అనంతరం అమ్మవారు కాళికా శక్తిగా సింహ వాహనంపై ఊరేగారు. బాణసంచా పేలుళ్లు మిన్నంటాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం చివరి రోజున ధర్మరాజుల స్వామి పట్టాభిషేకం, శయనసేవ కార్యక్రమాలతో తిరునాళ్లు ముగుస్తాయి. గ్రామ పెద్దలు బొమ్మన్‌ ఫణి, శ్రీధర్‌, గంగాధరంశెట్టి, గురునాథంశెట్టి, మాణిక్యంశెట్టి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం .. తడిసిన ధాన్యం

చిల్లకూరు : మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. గాలీవానతో కూడిన వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అకాల వర్షం దెబ్బకు బల్లవోలు గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో పండించిన ధాన్యం తడిచి ముద్ద అయ్యింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రారని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.



సైదాపురంలో కురుస్తున్న వర్షం

చిరుజల్లులు..

రాపూరు/పెళ్లకూరు/చిట్టమూరు: రాపూరు, పెళ్లకూరు, చిట్టమూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. రాపూరులో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెళ్లకూరు, చిట్టమూరు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. వర్షం కురవడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిట్టమూరు మండలంలోని గునపాడు, గునపాటిపాళెం, తిమ్మారెడ్డివాగు, ఎల్లసిరి, మెట్టు, ఈశ్వరవాక, చిట్టమూరు గ్రామాల్లో ఎడగారు వరి పైరు వేసేందుకు సిద్ధమైన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

దొరవారిసత్రం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘామృతమై ఒక్కసారిగా వాతావరణం మారింది. చల్లటి గాలులు వీచి వర్షం కురవడంతో ప్రజలు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో ఆకాశం దద్దరిల్లింది.

కమ్ముకున్న మేఘాలు

సైదాపురం: భానుడి ఉగ్ర రూపంతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీయడంతోపాటు వర్షం కురవడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.



జలమయమైన నాయుడుపేటలోని ప్రధాన వీధి

గాలీవానకు కూలిన చెట్లు

కోట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గాలీవానతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. కోట పట్టణంలో గాలులు విపరీతంగా వీయడంతో తహసీల్దార్‌ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న చెట్లు నేల కూలాయి. ఈ మార్గంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో రాకపోకలు ఆగిపోయాయి.

నాయుడుపేటలో భారీ వర్షం

నాయుడుపేట టౌన్‌ : నాయుడుపేటలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మేరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద ఎత్తున ఉరుములు, మెరుపుల రావడంతో ప్రజలు భయాందోళన చెందారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు ఇబ్బంది పడిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.



నాయుడుపేటలో విద్యుల్లత



సైదాపురంలో కమ్ముకున్న మేఘాలు



చిట్టమూరులో కురుస్తున్న వర్షం



డీవీ సత్రంలో గాలులతో కురుస్తున్న వర్షం



రాపూరులో కురుస్తున్న వర్షం

ఘనంగా ఉచిత ఖత్నాలు



ఖత్నాకు వచ్చిన పిల్లలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఈదులగుంట షాదీ మహల్‌లో ఆదివారం హజరత్‌ మహబూబ్‌ సుభానిరహా నిషాన్‌ ముతవల్లి షేక్‌ మీర్జాన్‌ సాహెబ్‌ ఆధ్వర్యంలో ఉచిత ఖత్నాలు కార్యక్రమం నిర్వహించారు. వెంకటగిరికి చెందిన డాక్టర్‌ అహమ్మద్‌ బాషా పిల్లలకు ఖత్నా చేసి మందులు, పండ్లు, బ్రెడ్‌ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని 26 ఏళ్లుగా చేస్తున్నట్టు ముతవల్లి షేక్‌ మీర్జాన్‌ సాహెబ్‌ తెలిపారు. ఎక్స్‌ యాంటీ కరప్షన్‌ ప్రెసిడెంట్‌ లాలూ ఇస్మాయిల్‌, సెక్రటరీ ఆరీఫ్‌, మీడియా ప్రెసిడెంట్‌ యాసిన్‌, ఖాదర్‌బాషా, ముజీబ్‌సాధిక్‌ కాలేషా, సలీం పాల్గొన్నారు.